క్లుప్తంగా

నేడు విద్యార్థులకు అవగాహన సదస్సు

షాద్‌నగర్: పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలోని శ్రీరంగరాయ ఆడిటోరియంలో గురువారం మధ్యాహ్నం పదోతరగతి ప్రభుత్వ, ప్రవేటు పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పదోతరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి పరీక్షలు ఏవిధంగా రాయాలి, ఉత్తమ ఫలితాలు ఏవిధంగా సాధించాలన్న అంశాలపై వివరించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా మనస్తత్వవేత్త సుధీర్ సంద్ర, మెంటా అకాడమీ చైర్మన్ మనోజ్‌కుమార్, విశ్రాంత డీఈఓ విజయ్‌కుమార్‌లు హాజరువుతున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



శ్రీరంగాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: కొందుర్గు మండలంలోని శ్రీరంగాపూర్‌లో బీమిడి దామోదర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి సోదరులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం పూజారి సతీష్ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణపతి పూజ, నవగ్రహ పూజ, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బీమిడి అశోక్ రెడ్డి, సతీశ్ రెడ్డి, రవి యాదవ్, పాపయ్య, అంజయ్య, జంగయ్య, రమేశ్, నర్సింలు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరంలో ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలన్నారు. సమాజానికి ఉపయోగపడేవిధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, విజయ్ భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, పసుల నర్సింహ్మా, ఆకుల ప్రదీప్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



పంచాయతీ అధికారులు కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

మొయినాబాద్: అక్రమంగా వెంచర్ చేసి నిర్మాణాలు చేపడుతుండడంతో పంచాయతీ అధికారులు వాటిని కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలోని సర్వేనెంబర్ 145లో నగరానికి చెందిన మాగంటి వజ్రనాథ్‌కు 9 ఎకరాల భూమి ఉంది. కొంత కాలం క్రితం కొందరు వ్యక్తులు ఆ భూమిని కబ్జాచేసి అందులో వెంచర్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వెంచర్‌లో నిర్మాణాలు చేపడుతుండడంతో పంచాయతీ అధికారులు అక్కడికి వెళ్లి వాటిని కూల్చివేశారు. దీంతో అక్కడ చాలా మంది గుమ్మిగూడిన విషయం తెలుసుకొని పోలీసులు అక్కడికి చేరుకుని అందరినీ చెదరగొట్టారు. దీనిపై పోలీసులు విచారణ చేయనున్నట్లు తెలిసింది.

కొత్తూరు సీఐగా నర్సింహారావు



కొత్తూరు: కొత్తూరు సీఐగా నర్సింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ శంకర్‌రెడ్డి కౌంటర్ నార్కొటిక్స్ విభాగానికి బదిలీపై వెళ్లారు. కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న నర్సింహారావు కొత్తూరు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

సావిత్రిబాయి పూలే నేటి తరానికి ఆదర్శం



షాద్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కొందుర్గులో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చేవెళ్ల: జయంతిలో అంబేద్కర్ అవార్డు గ్రహీత నారాయణదాస్, ఉపాధ్యాయురాలు మానేమ్మ

భారతదేశంపు తొలి ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త, రచయిత్రి సావిత్రిబాయి పూలే ఆశయాలను సాధిద్దామని పలువురు పేర్కొన్నారు. నియోజక వర్గంలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



షాబాద్: నివాళులర్పిస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి



షాద్‌నగర్‌రూరల్: సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



షాబాద్ బాలికల పాఠశాలలో నివాళులర్పిస్తున్న చేవెళ్ల పార్లమెంట్ బీఎస్పీ ఇన్‌చార్జి బర్క కృష్ణయాదవ్, ఉపాధ్యాయురాలు

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

- ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్
- సొంత నిధులతో అధ్యాపకుడికి వేతనం

షాద్‌నగర్‌రూరల్: నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యాకోర్సు అభ్యసిస్తున్న 400 మంది విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించేందుకు అధ్యాపకుడు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే తెలుసుకున్నారు. వారం రోజుల క్రితం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా అధ్యాపకుడు కొరత తెలిసింది. కళాశాలలో నెలకొన్న సమస్యలు విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత నిధులతో ఇంగ్లీష్ బోధించేందుకు అధ్యాపకుడిని నియమించారు. అధ్యాపకుడికి ఇవ్వవలసిన వేతనాన్ని ఆయన సమకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠ్యాంశాన్ని బోధించి మంచి ఉత్తీర్ణను సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. కళాశాలపై ఔధార్యాన్ని చూపినందుకు అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



మంత్రి కొండాసురేఖకు శుభాకాంక్షల వెల్లువ

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖను కేశంపేట జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొండాసురేఖను శాలువా కప్పి సన్మానించారు. పూలబొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గంలో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మంత్రి కొండాసురేఖకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి

ఉగ్రవాద సంస్థకు నిధులా?

- బీజేపీ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: మిలిటెంట్ ఉగ్రవాద సంస్థ తబ్లిగీ సమావేశాలు నిర్వహించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించడం బాధాకరమని బీజేపీ సీనియర్ నాయకుడు కె వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్లలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పూర్తిగా ప్రైవేటు వ్యవహారమైన ఇస్లామిక్ అతివాద సంస్థ నిర్వహించే మూడురోజుల సమావేశాలకు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాంది మంది తబ్లిగీలు హాజరవుతారన్నారు. ఈ సంస్థ బోధనలు, మూల సిద్ధాంతాలు ముస్లిం యువతని నిషేధిత ఇస్లామిక్ రాడికల్ గ్రూపుల్లో చేరడానికి ప్రేరేపించేవిధంగా ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ఉగ్రవాద సంస్థల్లో సభ్యత్వం తీసుకున్న మిలిటెంట్లలో 80శాతం మందికిపైగా తబ్లిగీ జమాత్ ప్రభావం ఉన్నవారేనని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు చెబుతున్నారన్నారు. ఈ సంస్థను ఇస్లామిక్ దేశాలైన ఇరాన్, సౌదీ అరేబియా, ఉజ్జెకిస్తాన్, కజకిస్తాన్, తజికిస్తాన్ రష్యాతో పాటు పలు ప్రపంచ దేశాలు నిషేధం విధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సంస్థలకు నిధులు కేటాయించడం మానుకోవాలని హితవు పలికారు.

రంగారెడ్డికి సన్మానం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, కవాడిపల్లి, ఇనాంగూడ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపూడి కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రంగారెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఏసీసీ ప్రధాన కార్యదర్శి ,మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖ, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు యశోద పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్: క్రీడలతో మానసిక వికాసం పొందవచ్చని యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వివేకానంద యువజన సంఘం, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని క్రీడపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, ఉప సర్పంచ్ రామకృష్ణ, కోఅప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, నాయకులు భాస్కర్ రెడ్డి, చందోజీ, మాధవులు తదితరులు ఉన్నారు.

ఒగ్గు కళాకారుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

- కురుమ సంఘం చిలుకూరు అధ్యక్షుడు దండు సురేందర్

మొయినాబాద్: ఒగ్గు కళాకారుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కురుమ సంఘం చిలుకూరు గ్రామ అధ్యక్షుడు దండు సురేందర్ పేర్కొన్నారు. పెద్దమంగళారానికి చెందిన ఒగ్గు కళాకారుడు శివకుమార్ షాబాద్ మండలంలోని చందన్‌వెల్లి గ్రామంలో ఒగ్గు కథ చెబుతుండగా మాత్‌పీస్‌కు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. బుధవారం దండు సురేందర్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దండు సురేందర్

ఇంటింటికీ శ్రీరామ అక్షితలు



చేవెళ్ల: అక్షితల పంపిణీలో పాల్గొన్న గ్రామ నాయకులు, అయ్యప్పస్వాములు



హనుమాన్ దేవాలయంలో అక్షితలను పూజ చేస్తున్న సామ ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల: అయోధ్యలోని శ్రీరాముని అక్షితలు ప్రతీ గడపకు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు భజరంగ్‌దళ్ ప్రముఖ దేవేందర్‌గౌడ్, శివగౌడ్, శ్రీకాంత్, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బుధవారం భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన శ్రీరాముని అక్షితలు, కరపత్రం, చిత్రపటాలకు పూజలు చేసి గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కల నేడు సాకారం కాబోతుందని రామమందిర నిర్మాణంతో దేశ ప్రజలందరికి శ్రీరాముని ఆశీస్సులు ఉంటాయన్నారు. అక్షితలను దేశం మొత్తం పంచటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదిరెడ్డి, హనుమాన్ దేవాలయ చైర్మన్ చామంతి శివరాజ్, ఇంద్రాసేనారెడ్డి, గ్రామస్తులు వెంకటేశ్, శర్వలింగం, నరేందర్‌గౌడ్, శ్రీకాంత్, జైపాల్‌గౌడ్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: అయోధ్య అక్షితలు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు ముద్దెంగూడ ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని హనుమాన్ దేవాయంలో అక్షితలను తీసుకెళ్తున్న రామభక్తులు, స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ అక్షితల పంపణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం హిందువుల ఆత్మగౌరవానికి ప్రతీకని చెప్పారు. దేశ వ్యాప్తంగా జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు అక్షితలు పంపిణీ చేస్తారన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



షాబాద్: సంకెపల్లిగూడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య



శంకర్‌పల్లి: మాట్లాడుతున్న వెంకయ్య గౌడ్



కొత్తూరు: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు

శంకర్‌పల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గాజులగూడ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలనలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకం లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు, ఏపీఎం భీమయ్య, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందని ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య పేర్కొన్నారు. సంకెపల్లిగూడలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించారు.

కొత్తూరులో..

కొత్తూరు: ఐదు గ్యారంటీలతో పాటు రేషన్‌కార్డు, ఇతర అవసరాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ తండా పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామాలు, గిరిజనతండాల్లో దరఖాస్తు ఫారాలు నింపడానికి అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, సర్పంచ్ రవినాయక్, అధికారులు, పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బోధించుటకు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ-1, ఎకనామిక్స్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన మహిళా అభ్యర్థులు సంబంధిత పత్రాలతో ఈ నెల 8లోపు కళాశాలలో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకోసం 8341915656, 6300051306, 9885003390 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

పదో ర్యాంకు రావడం అభినందనీయం

మొయినాబాద్ రూరల్: ఉన్నత విద్యా రంగంలో విద్యాజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రంలోనే 10వ స్థానంలో ఉందని జనగాం ఎమ్మెల్యే, విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్ల రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల 25వ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా జ్యోతి కళాశాలను 1998లో ఎడ్యుకేషన్ సొసైటీ గ్రూప్ ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నత విద్యలో విద్యార్థులను ఉన్నత స్థాయికి పంపుతూ వారి భవిష్యత్తుకు దారి చూపించిన కళాశాలగా కీర్తికెక్కిందన్నారు. జాతీయ ఇన్స్టిట్యూషన్‌లో 200 ర్యాంకింగ్‌తో పాటు ప్రతిష్ఠాత్మకమైన ఏప్లస్ గ్రేడ్ న్యాక్ అక్రిడేషన్‌ను సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం పూర్వ అధ్యాపకులను ఎమ్మెల్యే సన్మానించారు. దీంతో ఇంజనీరింగ్ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు అంబరానంటాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ సాయిబాబారెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ ఏ పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్ జి శ్రీలత, సీనియర్ ఏవో వెంకటాచలం, కన్వీనర్ డాక్టర్ జి శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్ల రాజేశ్వర్‌రెడ్డి